ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్నూలు
జిల్లా వార్తలు
శుక్రవారం 19 ఏప్రిల్ 2024



విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

చిప్పగిరి, ఏప్రిల్ 17: చిప్పగిరికి చెందిన యువరైతు కొండా చంద్ర విద్యుదాఘాతంతో గురువారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి పొలాన్ని కౌలు తీసుకుని చంద్ర, ఆయన తండ్రి రామాంజనేయులు మిరప, మునగ, కంది పైర్లు సాగు చేశారు. మిరప చేనుకు నీరు పెట్టేందుకు మోటారు వేయడానికి వెళ్ళినప్పుడు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే చంద్ర మృతి చెందాడు. పక్కనే ఉన్న తండ్రి విద్యుత్ సరఫరాను నిలిపి కుమారుడ్ని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే ఘోరం జరిగిపోయిందని బంధువులు తెలిపారు.

చాలా బాధగా ఉంది..

ఒక లక్ష్యంతో పార్టీలోకి వచ్చాను ● కోడుమూరుకు దూరంగా ఉండలేకున్నా..
గుండ్రేవుల, వేదవతి సాధించే వరకు నిద్రపోను ● సభలో కంటతడి పెట్టిన కోట్ల

కోడుమూరు, ఏప్రిల్ 18: 'చాలా బాధగా ఉంది. ఇన్నేళ్లపాటు నన్ను, మా కుటుంబాన్ని ఇంతగా ఆదరించిన మిమ్మల్ని విడిచి దూరంగా ఉండాలంటే చాలా కష్టంగా ఉంది...' అంటూ మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి కన్నీటిపర్యంతమయ్యారు. కోడుమూరు నియోజకవర్గ ప్రజలు తన కుటుంబాన్ని ఎంతగానో ఆదరించారని, వారందరినీ వదిలి డోన్‌లో పోటీ చేస్తున్నానన్నారు. కోడుమూరులో గురువారం కోట్ల కుటుంబం అభిమానులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని వీడి ఒక లక్ష్యంతో టీడీపీలోకి వచ్చానని అన్నారు. ఆర్డీఎస్, ఎల్లెల్సీ గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను సాధించేంత వరకు తాను నిద్రపోనన్నారు. 'కర్నూలు పార్లమెంటు నుంచి తాను పోటీ చేయలేదని 14 లక్షల మంది ఓటర్లు బాధపడుతున్నారు. కానీ డోన్ నియోజకవర్గంలోని రెండు లక్షల మంది ఓటర్లు సంతోషిస్తున్నారు. డోన్ ప్రజలు కూడా తన ఆత్మీయులే. పార్టీ ఆదేశాలను పాటించక తప్పడం లేదు..' చెప్పారు. అయితే కర్నూలు జిల్లా ప్రజలు తనకు దేవుళ్లలాంటి వాళ్లని, వారిని వదిలి వెళ్లిపోవడాన్ని తట్టుకోలేపోతున్నానని కంటతడి పెట్టారు. ముఖ్యంగా కోడుమూరు నియోజకవర్గ ప్రజలను వదిలిపెట్టి వెళ్లాలంటే తట్టుకోలే పోతున్నానని గద్గ స్వరంతో అన్నారు. కాసేపు ఆయన తన నోటి వెంట మాటలు రాలేకపోయాయి.



సభలో కంటతడి పెట్టిన కోట్ల

కాసేపు నిశబ్ద వాతావరణం

కోట్ల కుటుంబంపై తన అభిమానుల చూపిస్తున్న అభిమానం వర్ణిస్తూ కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి కంటతడి పెట్టారు. దీంతో అక్కడ నిశబ్ధ వాతావరణం చేటు చేసుకుంది. కోట్ల కంటతడిని చూడలేక అక్కడ ఉన్న కోట్ల అభిమానులు కూడా కన్నీరు పెట్టారు. నిశబ్ధ వాతావరణం నుంచి తేరుకున్న అనంతరం కోట్ల మాట్లాడుతూ పార్టీలో వర్గ విభేదాలు లేకుండా అందరూ కలిసి కట్టుగాపోతే తప్పకుండా టీడీపీ గెలుస్తుందని అన్నారు. టీడీపీ గెలవాలి కాబట్టి అభిమానులంతా కలిసి కట్టుగా పని చేసి కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని గెలిపించాలని కార్యకర్తలను కోరారు. తప్పకుండగా టీడీపీ అధికారంలోకి వస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఒక రైతు బిడ్డగా రైతులకు ఇచ్చిన హామీలను తప్పకుండగా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు.

కోట్లను క్షమాపణ కోరిన నాగరాజు!

కోడుమూరు నిర్వహించిన టీడీపీ కార్యకర్తల సమావేశానికి కర్నూలు ఎంపీ అభ్యర్థి నాగరాజు సమావేశానికి రెండు గంటలు ఆలస్యంగా వచ్చారు. కర్నూల్లో నామినేషన్ వేయడం వల్ల సభకు ఆలస్యంగా వచ్చినందుకు తనను క్షమించాలని నాగరాజు కోట్లను కోరారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ కులమత బేధాలు లేకుండా అభిమానులతో ఉన్నానని అన్నారు. తనలాగే అందరిని కలుపుకొని వెళ్లాలని, లేకపోతే రాజకీయంలో భవిష్యత్తు ఉండదన్నారు. కార్యకర్తల సమావేశం ముగిసిన అనంతరం వచ్చిన బొగ్గుల దస్తగిరి నామినేషన్ వేయడం వల్ల తన రాక ఆలస్యమైందని కోట్లకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచు భాగ్యరత్న, మాజీ సర్పంచు కేఈ రాంబాబు, నీబీ లత, కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ టీడీపీ నాయకులు కోట్ల కవితమ్మ, సుధాకర్‌రెడ్డి, గోవిందుగౌడ్, అమడగుంట్ల క్రిష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, తిరుమల్‌నాయుడు, సత్రం రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి

నేడు ఆలూరుకు చంద్రబాబు

ఆలూరు, ఏప్రిల్ 17: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు శుక్రవారం ఆలూరుకు రానుండటంతో గురువారం టీడీపీ నాయకులు ఏర్పాట్లను పరిశీలించారు. ఆలూరు పట్టణ శివారులోని అగ్రహారం కొండల్లో హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ జోనల్-5 ఎన్నికల సమన్వయకర్త వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు చంద్రబాబునాయుడు ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చి, అక్కడి నుంచి రోడ్ షో ద్వారా అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీ జన సమీకరణకు వీరభద్రగౌడ్ ప్రయత్నిస్తున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రావాలని ఆయన పిలుపునిచ్చారు.

- ఏర్పాట్లను పరిశీలించిన టీడీపీ నేతలు
- భారీ జన సమీకరణకు వీరభద్రగౌడ్ యత్నం



హెలిప్యాడ్ మైదానాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

తొలి రోజు 15 నామినేషన్లు



కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బస్తిపాటి నాగరాజు



ఎమ్మిగనూరులో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు ఇస్తున్న టీడీపీ అభ్యర్థి బీవీ



కర్నూలు ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు ఇస్తున్న కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి

కర్నూలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కురుక్షేత్రంలో మరో అంకం మొదలైంది. కర్నూలు పార్లమెంట్ సహా అసెంబ్లీ నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారులు (ఆర్‌ఓ) గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్ల స్వీకరణకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో కర్నూలు పార్లమెంట్ స్థానం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, పాణ్యం నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. కర్నూలు ఎంపీ స్థానం, కోడుమూరు, ఎమ్మిగనూరు, కర్నూలు, ఆదోని నుంచి 15 మంది అభ్యర్థులు తొలి రోజే నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నుంచి ఒక్క నామినేషన్ కూడా రాలేదు. టీడీపీ ఎంపీ అభ్యర్థులుగా బస్తిపాటి నాగరాజు, ఆయన సతీమణి కె. జయసుధ, స్వతంత్ర అభ్యర్థి తెలంగాణ రాష్ట్రానికి చెందిన టి. బీచుపల్లి నామినేషన్లు వేశారు. ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి వేలాది మంది టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కార్యకర్తలు, నాయకుల ఆనందోత్సాహాల మధ్య నామినేషన్లు దాఖలు చేశారు. ఆయన తండ్రి దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి సంప్రదాయం కొనసాగింపుగా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో బీవీ జయనాగేశ్వరరెడ్డి నామినేషన్ పత్రాలు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బీవీ సతీమణి బీవీ నిత్యారెడ్డి కూడా రెండు సెట్లు నామినేషన్ పత్రాలు వేశారు. వైసీపీ అభ్యర్థి, మాజీ ఎంపీ బుట్టా రేణుక నామినేషన్ దాఖలు చేశారు. కోడుమూరు (ఎస్సీ) టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి వెళ్లి కర్నూలు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్‌ఓ శేషిరెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సతీశ్ తరఫున శివశంకర్ నామినేషన్ వేశారు. కర్నూలు నుంచి ఎస్‌డీపీఐ అభ్యర్థి ఖలీల్‌అహ్మద్, అన్న వైఎస్ఆర్ పార్టీ అభ్యర్థి అబ్దుల్ సత్తార్, ఆదోని నుంచి బీఎస్‌పీ అభ్యర్థి షేక్ ఆసియాభాను నామినేషన్ పత్రాలు దాఖాలు చేశారు. మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు, పాణ్యం నుంచి తొలి రోజు ఒక్క నామినేషన్ కూడా రాలేదు.




నామినేషన్ వేసేందుకు వెళ్తు ప్రజలకు అభివాదం తెలుపుతున్న బీవీ



అందరి ఊరు ఆలూరు

ఆలూరు నియోజకవర్గం ఎందరినో ఆదరించింది. ఎస్సీలు, బీసీలు, ఓసీలు ఇలా అన్ని సామాజిక వర్గాల నాయకులు ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హొళగుంద, హాలహర్వి మండలాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. మొదటిసారిగా హెచ్ రామలింగారెడ్డి జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు.





ఆలూరు, ఏప్రిల్ 18: ఆలూరు నియోజకవర్గం 1955లో ఏర్పడింది. ఈ నియోజకవర్గంలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హొళగుంద, హాలహర్వి మండలాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. మొదటిసారిగా హెచ్ రామలింగారెడ్డి జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. 1967 వరకు ఓసీ జనరల్‌గా ఉన్న నియోజకవర్గం 1967లో ఎస్సీ జనరల్‌గా మారింది. దీంతో గోవింద్ దాస్ ఎస్సీ రిజర్వేషన్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత మసాల ఈరన్న 1978లో, 1985లో కాంగ్రెస్ పార్టీ నుంచి, 1994లో టీడీపీ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత మూలింటి మారెప్ప 1999లో 2004లో రెండు సార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో ఆయన రాష్ట్ర ఎత్తిపోతలు, మార్కెటింగ్ శాఖ మంత్రిగా ఉమ్మడి రాష్ట్రంలో పని చేశారు. మసాల ఈరన్న, లక్ష్మీకాంతరెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌లుగా పని చేశారు. డీ లిమిటేషన్‌లో భాగంగా పత్తికొండ నియోజకవర్గంలో ఉన్న దేవనకొండ మండలం ఆలూరు నియోజకవర్గంలోకి మారడంతో తెర్నేకల్లు గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే శేషిరెడ్డి సతీమణి నీరజారెడ్డి 2009లో ఆలూరు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి పీఆర్పీ అభ్యర్థి గుమ్మనూరు జయరాంపై గెలుపొందారు. 2014లో గుమ్మనూరు జయరామ్ ఎమ్మెల్యేగా వైసీపీ నుంచి గెలిచారు. 2019లో రెండో సారి అదే పార్టీ నుంచి గెలుపొంది జగన్ క్యాబినేట్‌లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు.

● సామాజికవర్గాల వారిగా ఓటర్లు...

బీసీ బోయ (వాల్మీకి)	68,000
ఎస్సీ సామాజికవర్గం	36,770
బీసీ కురువ	32,000
ముస్లిం మైనారిటీలు	21,000
లింగాయత్	20,050
పింజారి	16,400
బీసీ గొల్ల (యాదవ)	15,400
రెడ్డి	11,000
చాకలి	6,950
కమ్మ	6,900
వడ్డె	5,700
ఈడిగ	5,650
జంగమ	5,200
బలిజ	4,800
బెస్త	4,800
జీరా	2,000
సుగాలి	1,940

● ఆలూరు నియోజకవర్గంలో ఓటర్లు

పురుషులు	1,29,667
మహిళలు	1,28,425
ఇతరులు	53
మొత్తం	2,58,145

● ఆలూరు నియోజకవర్గం నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు...

1. హెచ్ రామలింగారెడ్డి	భారత జాతీయ కాంగ్రెస్	1955
2. డీ లక్ష్మీకాంత రెడ్డి	భారత జాతీయ కాంగ్రెస్	1962
3. డీ గోవిందదాస్	స్వతంత్ర అభ్యర్థి	1967
4. పీ రాజారత్నరావు	భారత జాతీయ కాంగ్రెస్	1972
5. మసాల ఈరన్న	ఇండియన్ కాంగ్రెస్	1978
6. కే బసప్ప	కాంగ్రెస్	1983
7. మసాల ఈరన్న	కాంగ్రెస్	1985
8. ఎం రంగయ్య (ఉప ఎన్నికలు)	తెలుగుదేశం పార్టీ	1987
9. గుడ్లన్నగారి లోకనాథ్	కాంగ్రెస్	1989
10. మసాల ఈరన్న	తెలుగుదేశం పార్టీ	1994
11. మూలింటి మారెప్ప	కాంగ్రెస్	1999
12. మూలింటి మారెప్ప	కాంగ్రెస్	2004
13. పాటిల్ నీరజారెడ్డి	కాంగ్రెస్	2009
14. గుమ్మనూరు జయరామ్	వైసీపీ	2014
15. గుమ్మనూరు జయరామ్	వైసీపీ	2019

● 2014లో గెలిచిన అభ్యర్థి

2014లో వైసీపీ నుంచి గుమ్మనూరు జయరాం టీడీపీ నుండి వీరభద్రగౌడ్ బరిలో నిలిచారు. పోటాపోటీగా జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్‌కు 67,547 ఓట్లు రాగా, వైసీపీ నుంచి గుమ్మనూరు జయరామ్ 69,466 ఓట్లు సాధించి వీరభద్రగౌడ్‌పై 1919 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

● 2019లో గెలిచిన అభ్యర్థి

2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి కోట్ల సుజాతమ్మ, వైసీపీ నుంచి రెండో సారి గుమ్మనూరు జయరాం పోటీ చేశారు. ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ అభ్యర్థి కోట్ల సుజాతమ్మకు 67,205 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరామ్‌కు 1,07,101 ఓట్లు పడ్డాయి. 39,896 ఓట్ల మెజారిటీతో గుమ్మనూరు జయరాం గెలుపొందారు.

గెలుపోటములను నిర్ణయించనున్న దేవనకొండ, ఆస్పరి ఓటర్లు



ఆలూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములు దేవనకొండ, ఆస్పరి మండలాల ఓటర్లు నిర్ణయిస్తూ వచ్చారు. నియోజకవర్గంలో అత్యధికంగా 58వేల పైచిలుకు ఓట్లు దేవనకొండలో ఉన్నాయి. రెండో స్థానంలో ఆస్పరి మండలంలో 52,328 ఓట్లు ఉన్నాయి. ఈ రెండు మండలాలల్లో మెజారిటీ అభ్యర్థుల గెలుపును నిర్ణయిస్తాయి.

ఎన్నికల పరిశీలకుల నియామకం

లెక్క తేలుతుంది..!

కర్నూలు (కలెక్టరేట్), ఏప్రిల్ 18: కేంద్ర ఎన్నికల సంఘం కర్నూలు జిల్లాకు ఎన్నికల పరిశీలకులను నియమించింది. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు ఐఏఎస్ అధికారి జాఫర్‌ను, పత్తికొండ, ఆదోని, ఆలూరు నియోజకవర్గాలకు ఐఏఎస్ అధికారి తారీఖ్ అలీని నియమించారు. అదేవిధంగా కర్నూలు పార్లమెంటు నియోజకవర్గానికి ఎన్నికల వ్యయ పరిశీలకులుగా ఐఆర్ఎస్ అధికారి ఆర్ఆర్ఎన్ శుక్లాను నియమించారు. కర్నూలు, పాణ్యం, పత్తికొండ, కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల వ్యయ పరిశీలకులుగా ఐఆర్ఎస్ అధికారి అరినందం ముఖో ఉపాధ్యాయ్, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఐఆర్ఎస్ రాకేష్ బాదాదియాను నియమించారు.

అరచేతిలో రాజకీయం

● సోషల్ మీడియా వేదికగా ప్రచారం
● హోరెత్తిస్తున్న అభ్యర్థులు





● పోస్టు పెట్టు.. ఫాలోవర్స్‌ను పట్టు

ఆదోని, ఏప్రిల్ 18: సోషల్ మీడియా.. ఇప్పుడు ఇదో పెద్ద వేదిక... జనాలతో కమ్యూనికేషన్ కావాలన్నా... మనుషులను తప్పుదారి పట్టించాలన్నా... వెబ్ దునియాలో ఉన్న మెయిన్ ప్లాట్‌ఫారం ఇది. ఎక్కడ ఏమి జరుగుతుందో తెలుసుకునేందుకు అరచేతిలో ఉన్న అద్భుత టెక్నాలజీ. సామాన్యుల నుంచి సంపన్నుల దాకా, కార్యకర్త నుంచి లీడర్ దాకా అందరూ అందిపుచ్చుకుంటున్న సాధనం ఇది. ఈ నేపథ్యంలోనే మారుతున్న కాలానుగుణంగా రాజకీయ పార్టీలు సైతం ఎన్నికల ప్రచారానికి సోషల్ మీడియానే ప్రథమ ఆయుధంగా ఎంచుకుంటున్నారు. ఇప్పటిదాకా సోషల్ మీడియా వైపు కూడా చూడని నేతలు ఒక్క పోస్టుతో వందలు, వేల మందిని ఫాలోవర్స్‌గా మలుచుకుంటున్నారు. ఎలక్షన్ నేపథ్యంలో లక్షల సంఖ్యలో ఫాలోవర్స్ ఉండే సోషల్ మీడియా పేజీలను కొందరు డబ్బులకు అమ్మేస్తున్నారు. ఒక్కో ఫాలోవర్‌కు మూడు నుంచి ఐదు వేల వరకు ధర నిర్ణయిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఏపీలోని ప్రధాన నగరాల్లో వీటికి భలే డిమాండ్ ఉండేదని, ప్రస్తుతం ఇప్పుడు పట్టణాలకు పాకిందని సోషల్ మీడియా స్ట్రాటజిస్టులు చెబుతున్నారు.

సోషల్ మీడియాలో పోస్టుల కంటెంట్ నచ్చితేనే ఎక్కువ మంది వారిని ఫాలో అవుతూ ఉంటారు. ఉదాహరణకు కొందరు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ ఎక్స్‌లో ఒక పేజీని ప్రారంభిస్తారు. ప్రస్తుతం ఉన్నటువంటి రాజకీయ పరిస్థితులు ప్రజలకు చేరువయ్యే విధంగా పోస్టులను పెడుతుంటారు. అనంతరం అవి వైరల్ అయిన తరువాత అడ్మిన్‌లు ఈ పేజీలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నటువంటి రాజకీయ పరిణామాలకు సంబంధించిన వీడియోలు, వాళ్లని కామెంట్ చేస్తూ మీమ్స్... ఈ విధంగా నిత్యం ఏదో ఒకటి పోస్టు చేస్తుంటారు. ఇలా పెట్టినటువంటి పోస్టు లేదా వీడియో వైరల్ అయ్యిందా...! ఒక్క నెల రోజుల్లోనే లక్షల్లో ఫాలోవర్స్‌ను సొంతం చేసుకుంటారు. ఈ విధంగా ఫాలోవర్స్ పెరిగిన తరువాత అడ్మిన్‌ను తొలగిస్తారు. ఒక్క ఫాలోవర్ నుంచి రూ.3 నుంచి రూ.5వేల రూపాయలకు కొంటారు. ఎవరైనా డబ్బు చెల్లిస్తే ఖాతాను వారి పేర్ల మీద మార్చేస్తారు. ఈ విధంగా సోషల్ మీడియా స్ట్రాటజిస్టులకు భలే డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలోనే వివిధ పార్టీల అభ్యర్థులు, ఆశావాహులు వీరిని తాత్కాలికంగా నియమించుకుంటున్నారు. వాళ్లు చేసేటువంటి పర్యటనలు, ప్రసంగాలు నియోజకవర్గ స్థాయిలో ప్రజలను ఆకట్టుకునే విధంగా పోస్టులు పెడుతున్నారు. ఈ విధంగా సామాజిక మాధ్యమాలలో చాలా మంది అభ్యర్థులు దూసుకుపోతున్నారు.

సీ విజిల్ పని చేస్తుందా లేదా..!

తెలుసుకుందాం..



కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 18: సీ విజిల్‌కు ఫిర్యాదులు వస్తున్నాయి. సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లో ఆ ప్రాంతానికి వెళ్లి సిబ్బంది పరిశీలించాల్సి ఉంటుంది. వివిధ అంశాలకు సంబంధించి ఇప్పటి వరకు 192 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 85 ఫిర్యాదులు అనుమతులు లేకుండా ఇళ్లు, భవనాలకు పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేశారని వచ్చాయి. ఫిర్యాదుల్లో 135 డ్రాప్ కాగా మిగిలినవి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొందరు యాప్ డౌన్‌లోడ్ చేసుకొని పని చేస్తుందా లేదా అని తెలుసుకోవడానికి ఓ ప్రాంతానికి బదులు మరో ప్రాంతం ఎంపిక చేసి ఫిర్యాదు చేస్తున్నారు. అలాంటివి డ్రాఫ్ట్ కేటగిరిలోకి వెళ్తాయని ఎన్నికల విభాగం వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎన్నికల విధుల్లో 16వేల మంది

సమాచారం

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18: కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల ఎన్నికలకు సంబంధించి 16వేల మంది అధికారులను కలెక్టర్/ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ సృజన నియమించారు. ఒక పార్లమెంట్, 8 నియోజకవర్గాలకు సంబంధించి 2,204 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా 5,357 పీవో, ఏపీవోలకు ఈవీఎంలపై రెండు విడతల వారిగా శిక్షణా కార్యక్రమాలు ముగిశాయి. మే 1న అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. పీవో, ఏపీవో, నలుగురు ఓపీవోలు 20 శాతం రిజర్వుతో కలిసి దాదాపుగా 16వేల మంది ఎన్నికల విధులకు హాజరు కానున్నారు. వీరిలో 213 మంది సెక్టోరియల్ అధికారులు, 35 ఎంసీసీ బృందాలు, 64 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 78 ఎస్ఎస్‌టీ బృందాలు, 11 వీఎస్‌టీ బృందాలు, 10 వీడియో బృందాలు, 9 అకౌంటింగ్ బృందాలు, 12మంది సహాయ ఎన్నికల వ్యయ అబ్జర్వర్లు విధులను నిర్వర్తిస్తున్నారు.

పార్టీలకు కొమ్ము కాస్తే ఉద్యోగం ఊడినట్లే..

● జీ అలర్ట్



కర్నూలు(కలెక్టరేట్)/ ఆదోని, ఏప్రిల్ 18: ప్రభుత్వ ఉద్యోగులు ఏ పార్టీకి బహిరంగంగా మద్దతు తెలపకూడదు. అనుకూలంగా ప్రచారం కూడా చేయకూడదు. ఉద్యోగులకు వివిధ రాజకీయ పార్టీలు, నాయకుల పై అభిమానం ఉన్నప్పటికీ ఎన్నికల ప్రచారంలో, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. ఉద్యోగులు ఎవ్వరైనా ఎన్నికల కార్యక్రమాల్లో పాల్గొంటే వారి పై చర్యలు తీసుకునే విధంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ, కాంట్రాక్ట్ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు మద్దతు ఇవ్వకూడదు. ఉద్యోగులు ఎన్నికల్లో ఓటు వేయవచ్చు. ఎన్నికల్లో అభ్యర్థుల పక్షాన ప్రచారం చేస్తే, భారీ మూల్యం చెల్లించకతప్పదు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారం చేసినట్లు ఆధారాలతో రుజువైతే ఉద్యోగానికి ఎసరు వస్తుంది. ప్రభుత్వం నుంచి ఏ రకంగానైనా, నెల నెలా డబ్బులు పొందేవారు ఎన్నికల ప్రచారం చేయడానికి అనర్హులు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చాలా మంది వలంటీర్లు, ఆర్పీలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఎన్నికల ప్రచారంలో ఉద్యోగులు భాగస్వాములు కావడం వివాదానికి దారి తీస్తుంది. మోటర్ బైక్‌ల ర్యాలీలు, సాధారణ ర్యాలీలు, సభలలో పాల్గొనకూడదు.. ఒక పార్టీకి చెందిన వారు మరో పార్టీ వారి రోజు వారి ప్రచారాలు, ఇతర కార్యక్రమాల పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎప్పుడు ఏమి చేస్తున్నారో...? ఏ సమయంలో ఏమి చేస్తున్నారో...? రికార్డింగ్ చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్‌లలో చిత్రీకరించి సంబంధిత క్లిప్‌లను నేరుగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి పంపుతున్నారు. ఆధారాలు ఉంటే ఎన్నికల అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటున్నారు.

● వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది. పార్టీలకు సంబంధం లేకుండా సమావేశాలు నిర్వహించాలి. లేదంటే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద వస్తుంది. ఆధారాలతో ఎవరైనా జిల్లా ఉన్నతాధికారికి ఫిర్యాదు చేస్తే, చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

● ప్రస్తుతం దాదాపు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది. పాఠశాల విద్యార్థుల నుంచి, వృద్ధుల వరకు స్మార్ట్ ఫోన్‌లను వినియోగిస్తున్నారు. పార్టీ నేతల ప్రచారంలో పాల్గొంటే, వారితో ఫోటోలు దిగడం, ర్యాలీలు, ప్రచార కార్యక్రమాల ఫోటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం, పోస్టు చేయడం పరిపాటిగా మారింది. సోషల్ మీడియా ఆధారాలతో కూడా ఉద్యోగుల పై అధికారుల వేటు వేసే అవకాశం ఉంది. అందుకే, ఉద్యోగులు ప్రచారానికి దూరంగా ఉండాలి. ఉద్యోగులే కాకుండా, ప్రభుత్వం నుండి గౌరవ వేతనం పొందే ఏ ఒక్కరూ పార్టీల ప్రచారంలో పాల్గొనడం ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందికే వస్తుంది.

పైసలు ఉంటే జర జాగ్రత్త..!


కోడ్ ఎఫెక్ట్



ఆదోని, ఏప్రిల్ 18: రైతులు తమ పంటకు సంబంధించిన నగదును ఇంటికి తీసుకెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకెళ్తే పోలీసు అధికారులు సీజ్ చేస్తారు. సరైన ఆధారాలతో నగదు తీసుకెళ్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం రైతులు తమ పంట దిగుడబడులైన పత్తి, వేరుశనగ పంటలను విక్రయిస్తున్నారు. రైతులు పంట దిగుబడులు అటు ట్రేడర్లు, బ్యాంకు నుంచి ఇంటికి నగదు తీసుకెళ్తుంటారు. రూ.50వేలకు మించి నగదు తీసుకుపోతుంటే, తగిన ఆధారాలు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్ వ్యాపారులకు పంట విక్రయిస్తే పట్టిని వెంట ఉంచుకోవాల్సి ఉంటుంది. అదే విధంగా బ్యాంకు నుంచి విత్‌డ్రా చేస్తే పత్తి, వేరుశనగ పంటలకు సంబంధించిన పట్టీలు (బిల్స్)ను చూపించాల్సి ఉంటుంది.


పొరపాటు గ్రహపాటు కాకూడదు

నామినేషన్ టెన్షన్



ఆదోని, ఏప్రిల్ 18: నామినేషన్ పత్రాల్లో ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉంది. నామినేషన్ల దాఖలు గురువారం నుంచి ప్రారంభం అవుతుండటంతో ఇప్పటికే టికెట్లు దక్కించుకున్న అభ్యర్థులతోపాటు తమకే టికెట్ వస్తుందన్న ధీమాతో ఉన్న వారు నామినేషన్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నారు. ఇందుకోసం అడ్వకేట్లు, సీఏలతోపాటు సీనియర్ నేతలను సంప్రదిస్తున్నారు. నామినేషన్ దాఖలు చేసేందుకు అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. విజయం సాధించిన తరువాత తమ అఫిడవిట్‌పై ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా నిపుణుల సలహాలు తీసుకుంటూ డమ్మీ నామినేషన్ పత్రాలను వేస్తున్నారు. తమ ఖర్చుల వివరాలు సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.


వాట్సాప్ ద్వారా ప్రచార భేరీ



ఆలూరు, ఏప్రిల్ 18: ఎన్నికలంటే అభ్యర్థులు, వారి అనుచరులు ప్రజలను వ్యక్తగతంగా కలవడం వారికి కరపత్రలు అందించడం సహజం.. అయితే ఇప్పుడు ప్రచార శైలి మారింది. సోషల్ మీడియా ప్రభావం పెరిగిపోవడంతో అభ్యర్థులు కొంత ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఫోన్లలో వాట్సాప్ మెసేజ్‌లు, పోస్టులు కుప్పలు తెప్పలుగా వస్తుండటంతో ఫోన్ స్టోరేజ్ ఫుల్ అయిపోతోంది. ఇందుకు కారణం ప్రతి రాజకీయ పార్టీ అభ్యర్థుల అనుచరులు వారి పేరు మీద, పార్టీ పేరు మీద, 10 వరకు వాట్సాప్ గ్రూప్‌లను క్రియేట్ చేసి అందరినీ యాడ్ చేస్తూ ప్రతి రోజూ అభ్యర్థుల ప్రచారం సాగిస్తున్నారు. మండల, నియోజకవర్గ స్థాయి మొదలుకొని గ్రామల పేరుతో, కుల సంఘాల పేరుతో కూడా గ్రూప్‌లు ఏర్పాటు చేసుకొని మెసేజ్‌ల రూపంలో ఓటు వేయాలని కోరుతున్నారు. తెలిసిన వారే కదా అని చాలా మంది గ్రూప్ నుంచి ఎగ్జిట్ కాలేకపోతున్నారు. ఉదయం లేచి చూస్తే 500కు పైగా వాట్సాప్ పోస్టులు వచ్చి పడుతున్నాయి. వీటి తాకిడికి కొందరు ఆటోమేటిక్ డౌన్లోడ్ ఆప్షన్‌ను మార్చుకుంటున్నారు. కొందరు మెసేజ్‌లు చూసిన వెంటనే క్లియర్ చాట్ కొడుతున్నామని చెబుతున్నారు. దీనికి తోడు కొందరు జర్నలిస్టులు సైతం వారి కంపెనీ పేర్లతో గ్రూప్‌లు క్రియేట్ చేసి ప్రతి రోజూ వచ్చే వార్తలను పోస్టు చేస్తున్నారు. వాటికి డౌన్లోడ్ చేసుకుంటున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉదయమే వారి వార్తలను అన్ని గ్రూప్‌లో పోస్టు చేయడంతో వాటిని డిలీట్ చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

పోలింగ్ బూత్‌లో 1,400 ఓట్లే ఎందుకు..?

తెలుసుకుందాం..



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18: ఒక్కో పోలింగ్ బూత్‌లో గరిష్ఠంగా 1,400 మంది ఓటర్లు ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేస్తారు. ఇలా ఎందుకు చేస్తారో తెలుసా..? ప్రతి బూత్‌లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాడ్‌లు ఈ మూడు ఒకదానికొకటి అనుసంధానంగా పని చేస్తాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లకు అనుసంధానంగా ఉండే వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ అండ్ ట్రయల్)లో కాగితాన్ని పొందుపరుస్తారు. అది 1450 స్లిప్పులను మాత్రమే ముద్రిస్తుంది. బ్యాటరీతో పని చేసే వీవీ ప్యాట్‌లోని డిస్‌ప్లేలో ఓటు ఎవరికి వేశామన్నది కనిపిస్తుంది. అందులో 50 వరకు కాగితం, స్లిప్పులు, ఓటింగ్ రోజు మాక్ పోలింగ్ ప్రక్రియకు వాడుతారు. అందుకే ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1400 ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తారు.

సైకిల్‌పై తండ్రీ కొడుకుల స్వారీ



కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ గురువారం సైకిల్‌పై తిరుగుతూ ప్రచారం చేపట్టారు. ఆయన కుమారుడు టీజీ విభు కూడా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరంలో సైకిల్ యాత్ర చేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. దీంతో కొందరు టీజీ భరత్‌తోపాటు ఆయన కుమారుడిని చూసి విక్టరీ సింబల్ చూపగా వారు కూడా స్పందనగా విజయకేతనం చూపుతూ ముందుకు సాగారు. - కర్నూలు అర్బన్

ఆటో డ్రైవర్ నామినేషన్

● నేను సైతం..



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీచుపల్లి

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కర్నూలు పార్లమెంట్ స్థానానికి ఓ ఆటో డ్రైవర్ నిలవబోతున్నాడు. తెలంగాణ రాష్ట్రం అలంపూర్ నియోజకవర్గం ఉండవల్లి మండలంలోని బొంకూరు గ్రామానికి చెందిన టి.బీచుపల్లి గురువారం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. తన ఆటో నడుపుకుంటూ కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి.సృజనకు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. రూ.50వేలు వెంట తీసుకెళ్లిన ఆయన డిపాజిట్ రూపంలో రూ.25వేలు చెల్లించారు. తన బ్యాంకు ఖాతాలో రూ.2వేలు మాత్రమే ఉన్నాయని బీచుపల్లి తన అఫిడవిట్‌లో తెలియజేశాడు. ఇదిలా ఉండగా 2019 ఎన్నికల్లో కర్నూలు పార్లమెంట్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా 'ట్రాక్టర్ నడుపుతున్న రైతు' సింబల్‌పై పోటీ చేసిన ఆయనకు ఏకంగా 9,806 ఓట్లు పోలయ్యాయి. అంతేకాకుండా గత ఎన్నికల్లో కర్నూలు పార్లమెంట్ స్థానానికి 17 మంది పోటీ చేయగా బీచుపల్లి వరుసక్రమంలో ఆరోస్థానంలో నిలవడం విశేషం.

నేటి నుంచి జిల్లాలో షర్మిల 'న్యాయ యాత్ర'




కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 18: పీసీసీ అధ్యక్షురాలు వైస్ షర్మిల శుక్రవారం నుంచి కర్నూలు జిల్లాలో న్యాయయాత్ర చేపట్టనున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. బాబురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో షర్మిలా పాదయాత్ర వివరాలు వెల్లడించారు. గురువారం రాత్రి ఆలూరులో బస చేశాక 19న ఉదయం 10 గంటలకు ఆలూరులో సమావేశం ఉంటుందని, సాయంత్రం 4 గంటలకు ఆదోని బహిరంగ సభ, సాయంత్రం 6 గంటలకు ఎమ్మిగనూరులో బహిరంగ సభ అనంతరం కడప బయలు దేరి వెళ్తారు. ఈనెల 20న కడపలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తారని, అదేరోజు సాయంత్రం 6 గంట లకు కోడుమూరులో కోట్ల సర్కిల్‌లో బహిరంగ సభ, అనంతరం అక్కడి నుంచి బయలు దేరి కర్నూలు చేరుకుంటారు. ఈనెల 21న ఉదయం 10 గంటలకు కర్నూలు నగరంలో యాత్ర ప్రారంభమై బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్, శ్రీరామ్ టాకీస్, ఐదురోడ్ల కూడలి, వైఎస్ఆర్ సర్కిల్, గౌసియా హాస్పిటల్, కొండారెడ్డి బురుజు, పాతబస్టాండ్, కింగ్ మార్కెట్, గడియారం హాస్పిటల్, చౌక్‌లో మీటింగ్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, జమ్మిచెట్టు, జోహరాపురం, వెంకాయపల్లి, గార్గేయపురం మీదుగా నంద్యాల జిల్లాలోకి ప్రవేశిస్తారని పేర్కొన్నారు.

టీడీపీ జెండా ఎగరడం ఖాయం

గూడూరు, ఏప్రిల్ 18: కోడుమూరు కోటపై టీడీపీ జెండా ఎగరడం ఖాయమని కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ అన్నారు. గురువారం కోడుమూరులో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన టీడీపీ ఆత్మీయ సమావేశానికి గూడూరు నుంచి కోట్ల అభిమానులు, టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు రాజారెడ్డి, చెట్టుకింది మద్దిలేటి, లక్ష్మన్న, మల్లికార్జున, నాగరాజు, చెట్టుకింది సురేష్, చెట్టుకింది నారాయణ, మద్దిలేటి, మూలగేరి లక్ష్మన్న పాల్గొన్నారు.

21 నుంచి కోన వెంకటేశ్వర స్వామి ఉత్సవాలు



సి.బెళగల్, ఏప్రిల్ 16: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కొండపై వెలసిన కోన వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు గురువారం తెలిపారు. ఈనెల 21న గరుడోత్సవం, 22న ప్రభోత్సవం, 23న రథోత్సవం 24న పారువేట, 25న వసంతోత్సవం ఉంటుందని వారు పేర్కొన్నారు. అలాగే ఈనెల 26న పాలసైజు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలి పారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 18: కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ పర్యవేక్షణలో గురువారం సెబ్ పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఓర్వకల్లు పరిసర ప్రాంతాల్లోని నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. ఓర్వకల్లు గ్రామానికి చెందిన శికారి వసంతను అరెస్టు చేసి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే గ్రామ పరిసర ప్రాంతాల్లో దాడులు చేసి సుమారు 1800 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసి, కేసు నమోదు చేసినట్లు సెబ్ పోలీసు కేఆర్ రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జహేరాబేగం పాల్గొన్నారు.

ఘనంగా సవారమ్మ ప్రభోత్సవం

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 18: మండలంలోని అమడగుంట్ల గ్రామంలో సవారమ్మ ప్రభోత్సవం గురువారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో విశేష పూజలు చేపట్టారు. సాయంత్రం కుంభం తీసుకుని ప్రభ వద్దకు చేరుకున్నారు. అక్కడ పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవారి ప్రభను భక్తులు లాగారు. వేడుకను తిలకించేందుక ు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. టీడీపీ నాయకులు సర్పంచ్ వరలక్ష్మి, సురేష్ చలివేంద్రం ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, లెమన్‌వాటర్, తాగునీరు అందించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రవికిషోర్ పాల్గొన్నారు.

కర్నూలు రూపు రేఖలు మారుస్తా

కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్



సైకిల్ భరోసా యాత్రలో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 18: ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే కర్నూలు రూపురేఖలు మారుస్తానని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని ఎస్‌ఏపీ క్యాంపు వద్ద నుంచి ఆయన నాలుగో విడత టీజీ భరత్ సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్రలో టీజీ భరత్‌తోపాటు ఆయన కుమారుడు టీజీ విభు కూడా పాల్గొన్నారు. నగరంలో ఇద్దరు సైకిల్ తొక్కి ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ఐదేళ్లలో నగరం సర్వనాశనమైందని, ఏ వీధికి వెళ్లినా ప్రజలు సమస్యలే చెబుతున్నారన్నారు. వార్డుల్లో సమస్యలన్నీ తీర్చి నగరాన్ని నిజమైన స్మార్ట్ సిటీగా చేస్తానన్నారు. కొత్త పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తానన్నారు.

● టీజీ భరత్ చేపట్టిన సైకిల్ భరోసా యాత్ర ఎస్‌ఏపీ క్యాంప్, కొత్త బస్టాండ్, ఇందిరాగాంధీ నగర్, సీతారాంనగర్, ఆటోస్టాండ్, నుంచి ప్రధాన వీధులతో పాటు పంప్ హౌస్, పాలకొట్టాల, అశోక్‌నగర్, నరసింహారెడ్డి నగర్, ఆర్ఎస్ రోడ్డుసర్కిల్, బంగారుపేట మీదుగా మౌర్యఇన్ చేరుకుంది. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి హర్షద్, టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కార్పొరేటర్ కురువ పరమేష్, మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మన్సూర్ ఆలీఖాన్, వీరశైవ లింగాయతి రాష్ట్ర నాయకులు శివరాజ్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 18: కర్నూలు నగరంలోని ఆరో వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు షేక్ ఇంతియాజ్ బాషా టీడీపీలో చేరారు. కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ కార్యాలయంలో షేక్ ఇంతియాజ్ బాషాతోపాటు సాజిద్ బాషా, సర్దార్, ఉమర్, జుబేర్, తదితరులకు టీజీ భరత్ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్రానికి మంచి జరుగుతుందని, పార్టీ గెలుపునకు అందరూ కృషి చేయాల న్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి హర్షద్, టీడీపీ వార్డు ఇన్‌చార్జిలు ఇబ్రహీం, ఉస్మాన్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఉలిందకొండలో వైసీపీకి షాక్



గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరిన ఉలిందకొండ వైసీపీ నాయకులు

గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో గౌరు వెంకటరెడ్డి

కల్లూరు, ఏప్రిల్ 18: పాణ్యం నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. గురువారం పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత సమక్షంలో తెలుగు రమేష్, గౌండబోయ క్రిష్ణ, గొళ్ళఎల్లప్ప, క్రిష్టారెడ్డి, వెంకటేష్, డాక్టర్ భగవాన్, హరితోపాటు పలువురు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈవీ రమణ, రంస్వామిరెడ్డి, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, శ్రీకాంత్, జిలాని పాల్గొన్నారు.

● **టీడీపీలో చేరిన కొమరోలు వైసీపీ నాయకులు:** ఓర్వకల్లు మండలం కొమరోలు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు లక్ష్మన్న, శేఖర్, ఎల్లనాయుడు, మద్దిలేటి, రమేష్‌తోపాటు 40 కుటుంబాలు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వెంకటరాముడు, సామయ్య, బోయచంద్ర, తెలుగు మధు, గొల్లమహేష్, బండారు అరుణ్‌కుమార్, బోయ వెంకటేశ్వర్లు, బి. మద్దిలేటి ఉన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోవిందరెడ్డి, రామచంద్రుడు పాల్గొన్నారు.

● **టీడీపీ ప్రభుత్వం రాగానే మెగా డీఎస్సీ:** గౌరు చరిత
టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ విడుదల చేసి 25 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తానని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. గురువారం టీడీపీ యువ నాయకుడు కోనేటి అన్న ఆధ్వర్యంలో గౌరు స్వగృహంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో గౌరు చరిత పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే యువగళం పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేస్తారన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో పేదల బతుకుల్లో వెలుగులు: గౌరు చరిత
చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో పేదల బతుకుల్లో వెలుగులు నిండుతాయని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత న్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె కల్లూరు మండలం యాపర్లపాడు, కెపి.తాండ, ఎర్రకత్వ, చిన్నటేకూరు, పెద్దటేకూరు దూపాడు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం, భారీర్యాలీ, సభలు నిర్వహించారు. ఈసందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ టీడీపీ కూటమిని గెలిపించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, మాజీ ఎంపిపి వాకిటి మాధవి, ఉలిందకొండ టీడీపీ నాయకుడు ఈవీ.రమణ, ఎర్రకత్వ నాయకులు, నరేంద్రచౌదరి, మద్దయ్య, కేపీ తాండ నాయకులు హీరునాయక్, శంకర్‌నాయక్, చిన్నటేకూరు నాయకులు మాజీ సర్పంచు లక్ష్మన్న, మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు, మురళి, పద్మావతి, పెద్దటేకూరు నాయకులు తరుణ్‌కుమార్‌రెడ్డి, వెంకటప్ప, దూపాడు నాయకులు లోకేష్ పాల్గొన్నారు.

కోడుమూరు అసెంబ్లీ స్థానానికి మూడు నామినేషన్లు

టీడీపీ తరపున బొగ్గుల దస్తగిరి రెండు సెట్లు నామినేషన్లు



నామినేషన్ వేసిన అనంతరం బయటకు వస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 18: కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి తొలిరోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో టీడీపీ తరపున బొగ్గుల దస్తగిరి, టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ పరిశీలకుడు రామలింగారెడ్డితో కలిసి గురువారం నిరాడంబరంగా నామినేషన్ వేశారు. ఆయన రెండేసి చొప్పున నామినేషన్ పత్రాలు కర్నూలు ఆర్డీవో కార్యాల యంలో కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డికి అందజేశారు. ఆ రెండింటిలో ఒక నామినేషన్ పత్రానికి టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రతిపాదించారు. రెండో నామినేషన్‌కు నాగలాపురం గ్రామానికి చెందిన జె.సురేష్ ప్రతిపాదించారు. బొగ్గుల దస్తగిరి తన ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో పొందుపరిచారు. బొగ్గుల దస్తగిరి పేరుపై రూ.14.75లక్షలు చరాస్తులు(వాహనాలు, బంగారు, నగదు) కలిగి ఉన్నట్లు అఫిడవిట్‌లో సమర్పించారు. ఆయన భార్య పేరుపై రూ.7.70లక్షలు(12తులాలు బంగారు, నగదు) ఉన్నట్లు పేర్కొన్నారు. తనకు వారసత్వంగా వచ్చిన ఆస్తుల్లో రూ.60లక్షలు విలువ కలిగిన సిరాస్తిని అఫిడ విట్‌లో చూపించారు. అలాగే తన స్వీయ సంపాదిత స్థిరాస్తిని రూ.25లక్షలు విలువ కలిగినట్లుగా తెలియజేశారు. బొగ్గుల దస్తగిరి వెంట కోడుమూరు టీడీపీ పరిశీలకుడు రామలింగారెడ్డి, అడ్వకేట్ సేపూరి విజయమోహన్ ఉన్నారు.

● కోడుమూరు అసెంబ్లీ నియోజికవర్గ స్థానానికి వైసీపీ తరపున ఆదిమూలపు సతీష్ పోటీ చేస్తున్నారు. ఆయన తరపున నామినేషన్‌ను పులకుర్తి గ్రామానికి చెందిన శివశంకర్ నామినేషన్ పత్రాన్ని ఆర్వో శేషిరెడ్డికి గురువారం సమర్పించారు. ఆదిమూలపు సతీష్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి ప్రతిపాదించారు.

● **అటువైపు దుకాణాలు బంద్:** కర్నూలు ఆర్డీవో కార్యాలయంలో కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించిన నామినేషన్ కార్యాలయం ఏర్పాటు చేయడంతో అటువైపు ఉన్న దుకాణాలను సైతం పోలీసులు మూసివేయించారు. మరో వారంపాటు తిప్పలు తప్పవని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన
సి.బెళగల్: మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో గురువారం సూపర్ సిక్స్ పథకాలపై కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, రమేష్, వెంకటేష్‌గౌడు, భీమన్న, బాలాజీ వెంకటేష్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి
● ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సు ఇదే

ఓర్వకల్లు, ఏప్రిల్ 18: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై పూడిచెర్ల బస్టాండు సమీపంలో ఓ ట్రావెల్స్ బస్సు డివైడర్‌ను గురువారం తెల్లవారుజామున ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురుకి గాయా లయ్యాయి. ఈ విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి ఎస్ఐ రాజారెడ్డి చేరుకుని ప్రయాణికులను ఇతర వాహనాల్లో తరలించారు. క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తిరుపతి నుంచి హైదరాబాదు వెళ్తున్న ఏపీ 39యుజే7804 శ్రీకార్తీక్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ శ్రీనివాసులు అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ఈ ప్రమాదం సంభవించింది. చిత్తూరు జిల్లా పుత్తూరు గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ శ్రీనివాసులు (55), బస్సులో ప్రయాణిస్తున్న రాజంపేటకు చెందిన రాము(40) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులో ఉన్న క్లీనర్ శ్రీనివాసులు, కడపకు చెందిన ఓబయ్య, సోమశే ఖర్ రెడ్డిలకు స్వల్పగాయాలయ్యాయి. బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

బైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిక



బైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 18: టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో వైసీపీ చెందిన 140 కుటుంబాలు టీడీపీలో చేరారు. గురువారం శరీన్‌నగర్‌లోని అంబేద్కర్, జ్యోతిరావుఫూలే సర్కిల్లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 30వ వార్డు మాజీ కార్పొరేటర్ సంజన్నతో పాటు ఆయన తనయుడు వైసీపీ కార్పొరేటర్ జయరాముడు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ ప్రభుత్వ పాలన నచ్చక టీడీపీలో చేరుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. పార్టీలో చేరిన వారిలో రాజు, యోహాన్, సుందర్‌రాజు, జయన్న, శ్రీనివాసులు. వెంకటేశ్వర్లు ఉన్నారు. కార్యక్రమంలో బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై చర్యలు తప్పవు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 18: అక్రమంగా తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం కర్నూలు మండలం పూడూరులో సర్వే నెంబర్ 48లో లీజును అతిక్రమించి అర ఎకరం ఎక్కువగా తవ్వకాలు జరిపినట్లు తెలిసిందని తెలిపారు. సదరు లీజుదారుడికి నోటీసు జారీ చేసి సంజాయిషీ కోరామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో సర్వేయర్ మాధవి, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దీలీప్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

రాక్షస పాలనను అంతమొందించాలి

జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్‌బాబు



మాట్లాడుతున్న చింతా సురేష్‌బాబు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 18: రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించాలని జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతాసురేష్‌బాబు అన్నారు. గురువారం బిర్లాకాంపౌండులోని పార్టీ కార్యాలయంలో కల్లూరు, గడివేముల మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసమే జనసేన, బీజేపీ, టీడీపీలు పొత్తు పెట్టుకోవాల్సి వచ్చిందని అన్నారు. టీడీపీ కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కల్లూరు, గడివేముల మండలాల అధ్యక్షులు బజారి, రఫి పాల్గొన్నారు.

'ఉపాధి పనులను వినియోగించుకోండి'

ఓర్వకల్లు, ఏప్రిల్ 18: ఉపాధి కూలీలు పనులను వినియోగించుకోవాలని డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని గుట్ట పాడు, ఉప్పలపాడు గ్రామాల్లో జరుగుతున్న చెక్‌డ్యాం పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైందని, ప్రతి జాబుకార్డు ఉన్న కుటుంబానికి వంద రోజుల పనిదినాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీడీ వెంట ఏపీవో కుమార సాయినాథ్, వెంకట భూపాల్, వెంకట శేఖర్, కిషోర్ ఉన్నారు.

ఎండలపై జాగ్రత్తలు పాటించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 18: జిల్లాలో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డా.వై.ప్రవీణ్ కుమార్ సూచించారు. గురువారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అధిక ఎండలు, వడదెబ్బ నివారణ చర్యలపై మాట్లాడారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ తగిలి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

- వడదెబ్బ తగిలినప్పుడు సమయంలో అత్యవసర చికిత్స అందించకపోతే ప్రమాదం ఏర్పడుతుంది.
- పిల్లలు, వృద్ధులు ఎక్కువగా వడదెబ్బకు గురి కావచ్చును.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు:

- ఎండలో ఎక్కువగా తిరగకుండా ఉండాలి.
- ఎండలో పోవాల్సి వస్తే.. టోపీ గాని, గొడుగు గానీ ఉపయోగించాలి.
- తేలికంగా చెమట పీల్చే దుస్తులు ధరించాలి.
- ప్రతిరోజు సరిపడ నీరు తీసుకోవాలి

వడదెబ్బ తగిలితే.. ఏం చేయాలి:

- వడదెబ్బకు గురైన వారి బట్టలు టైట్‌గా ఉంటే వదులుగా చేయాలి.
- చల్లటి గాలి తగలనీవాలి. చల్లని ఫ్యాన్ గాలి కిందకు చేర్చి సేద తీర్చాలి.
- పరిశుభ్రమైన నీటితో ఉప్పు, పంచదార కలిపి తాగించాలి.
- శరీరంపై చల్లని నీటితో తడిసిన గుడ్డతో తుడవాలి.

దస్తగిరి నామినేషన్‌కు తరలిన టీడీపీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 18: కోడుమూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి నామినేషన్ కార్యక్రమానికి గూడూరు నుంచి టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. గురువారం గూడూరు టీడీపీ నాయకులు నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొగ్గుల దస్తగిరి విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జె సురేష్, దండు సుందరరాజు, గుడిపాడు మహేశ్వర రెడ్డి, సుమన్ బాబు, తెలుగు శ్రీను, మన్నన్ బాష, నాగప్ప యాదవ్, గిడ్డయ్య, రవి పాల్గొన్నారు.

పనికి వచ్చిన వారికే హాజరు వేయాలి

సి.బెళగల్, ఏప్రిల్ 18: ఉపాధి పనికి వచ్చిన వారికి మాత్రామే హాజరు వేయాలని ఎంపీడీవో శకుంతల సిబ్బందికి ఆదేశించారు. గురువారం మండలంలోని పోలకల్లు గ్రామంలో ఉపాధి పనులను ఆమె పరిశీలించారు.

అమడగుంట్లలో ఎడ్ల బండలాగుడు పోటీలు

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 18: మండలంలోని అమడగుంట్లలో శ్రీరామనవమిని పురస్కరించుకుని గురువారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో మొత్తం 5 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీలో గోపాల్, ఆదిశేషుల ఎద్దులు 3250 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో ఖైరవాడి గోపాల్, మూడో స్థానంలో పెద్దగోపాల్, వీరుపాక్షి ఎద్దులు నిలిచాయి. మొదటి విజేతకు టీడీపీ నాయకులు రమేష్, సురేష్ రూ.12 వేలు అందజేశారు. రెండో విజేతకు గోవిందు, వెంకటస్వామి కుమారులు రూ.8 వేలు అందజేశారు. ఎంపీటీసీ తిరుపతయ్య 3వ బహుమతిగా రూ.3500 అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శంకరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తులసిరెడ్డి, రవికిషోర్, శ్రీనివాసులు, వై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓటర్లను ప్రలోభపెట్టకుండా చర్యలు తీసుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కర్నూలు, పాణ్యం, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకుడు అరిందం ముఖోపాధ్యాయ (ఐఆర్ఎస్) తెలిపారు. గురువారం ఆయన కర్నూలు నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని క్షుణ్ణంగా కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నమోదు చేస్తున్నామని, అభ్యర్థుల ఎన్నికల ప్రచారాలకు చేస్తున్న ఖర్చును నమోదు చేస్తున్నామని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఏ. భార్గవ్‌తేజ ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా అరిందం ముఖోపాధ్యాయ నగర పాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్కోర్ విభాగం, సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకుల విభాగం, అకౌంటింగ్, ఎస్ఎస్‌టీ, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్ చేస్తున్న వీడియోగ్రఫీ విభాగాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎన్నికల సంఘం నిర్ణయించిన రేటు ప్రకారమే ఖర్చుల వివరాలను నమోదు చేస్తున్నామని తెలిపారు.

విజయాలను చంద్రబాబుకు కానుకగా ఇద్దాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



తిక్కారెడ్డిని కలిసిన విద్యార్థి నాయకులు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 18: జిల్లాలోని ఎంపీ, ఏడుగురు ఎమ్మెల్యేలను గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇద్దామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. గురువారం తిక్కారెడ్డిని ఆయన స్వగృహంలో తెలుగునాడు విద్యార్థి సమాఖ్య(టిఎన్ఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజవర్గాల్లో విస్తృతంగా అభ్యర్థుల తరపున ప్రచారంలో పాల్గొనాలని వారికి సూచించారు. ప్రతి ఒక్క కార్యకర్త తమ శక్తి మేరకు సైనికుల్లా పని చేసి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బేల్లేకల్లు సూర్యపవన్, కళ్యాణ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

అమ్మవారి అనుగ్రహం తర్వాతే అన్నీ

మద్దికెర, ఏప్రిల్ 18: మండల కేంద్రంలోని గ్రామదేవత మద్దమ్మ అవ్వ ఆశిస్సులు లేనిదే ఇక్కడి రాజకీయ నాయకులు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మొదలు పెట్టరు. ఎన్నికల ప్రచారాలు, నామినేషన్లు దాఖలు చేసే సమయాల్లో ముందుగా మద్దమ్మవ్వ అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు చేయడం సెంటిమెంటుగా కొనసాగుతోంది. అమ్మవారి దేవాలయ వాస్తు వల్లే ఈ సెంటిమెంట్ కొనసాగుతోంది. గురువారం పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అమ్మవారి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వైసీపీ అభ్యర్థి కె.శ్రీదేవి కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి కొన్ని ఇళ్లకు ప్రచారం చేశారు. 20 ఏళ్లుగా స్థానిక ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలు ఏ ఎన్నికలు జరిగినా అమ్మవారికి పూజలు చేసి ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది.

హంపా ఇన్‌చార్జి పోస్టుమాస్టర్‌గా శాంత కుమారి

మద్దికెర, ఏప్రిల్ 18: మండలంలో హంపా బ్రాంచి ఇన్‌చార్జి పోస్టుమాస్టర్ శాంత కుమారిని నియమించినట్లు అధికారులు గురువారం ఉత్తర్వులు పంపారు. ఇక్కడ పని చేస్తున్న పోస్టుమాస్టర్ ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో మంచెర్ల పోస్టుమాస్టర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

పీఎఫ్ షెడ్యూల్‌ను జిల్లాకు పంపడంలో నిర్లక్ష్యం

తుగ్గలి, ఏప్రిల్ 18: పీఎఫ్ షెడ్యూల్స్‌ను ప్రధానోపాధ్యాయులు జడ్పీకి పంపకపోవడంతో పీఎఫ్ జమ కాలేదని పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి అంగడి లోకేశ్ అన్నారు. గురువారం పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి అంగడి లోకేశ్ మాట్లాడుతూ 2021-22, 2022-23 సంబంధించిన పీఎఫ్ కిట్ తుగ్గలి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి జడ్పీ అధికారులకు పంపడంలో నిర్లక్ష్యం వహించారని, దీంతో రెండేళ్ల పీఎఫ్ నిధులు అప్‌డేట్ కాలేదని పేర్కొన్నారు. దీని వల్ల ఉపాధ్యాయులకు లోన్లు కూడా అందడం లేదన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి పీఎఫ్ కిట్స్ జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైసీపీ అరాచకాలకు బుద్ధి చెప్పండి : బీజేపీ

మంత్రాలయం, ఏప్రిల్ 18: రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలు, మోసాలు, అన్యాయాలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది, బీజేపీ ఆదోని డివిజన్ ఇన్‌చార్జి పురుషోత్తంరెడ్డి అన్నారు. గురువారం బీపీఆర్ ఫామ్ హౌస్ బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ, కురువ రాముడు పాల్గొన్నారు.

మదిరెలో సామూహిక వివాహాలు


నూతన జంటలను ఆశీర్వాదిస్తున్న దివాకర్‌రెడిడ, నాయకులు

కౌతాళం, ఏప్రిల్ 18: మదిరె గ్రామంలో ఉన్న ఉటగనూరు తాత మఠంలో గురువారం 21 జంటలు ఒక్కటయ్యాయి. మఠం ధర్మకర్త పంపారెడ్డి తాత ఆధ్వర్యంలో ఈ వివాహాలు గ్రామస్థుల సహకారంతో ఘనంగా జరిగాయి. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి 21జంటలకు ఉచితంగా మంగళసూత్రాలను, కాలిమెట్లను అందజేశారు. వీటిని దివాకర్ రెడ్డి చేతుల మీదుగా వధూవరులకు అందజేశారు.

చట్టసభలో పేదల వాణి వినిపిస్తాం : సీపీఐ

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 18: చట్టసభల్లో పేదలు, కార్మికుల వాణిని వినిపించాలంటే.. కమ్యూనిస్టులను గెలిపించాలని పత్తికొండ సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్య ప్రజలను కోరారు. గురువారం పట్టణంలో పలు ప్రాంతాల్లో సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్య ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాజాసాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బీవీ నామినేషన్

● తరలివచ్చిన టీడీపీ శ్రేణులు
● పసుపుమయంగా మారిన రహదారులు
● జగన్‌కు కౌంట్ డౌన్ మొదలైంది : బీవీ



ఎమ్మిగనూరు, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. తొలి రోజే ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయ నాగేశ్వరరెడ్డి అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా ఎమ్మిగనూరు ప్రజల ఆరాధ్యదైవమైన నీలకంటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పండితులు ఆశీర్వాదాలు తీసుకున్నారు. అలాగే ట్యాంకు బండ్ రోడ్డులో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రదక్షణలు చేశారు. అక్కడి నుంచి వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన వేలాది మంది టీడీపీ శ్రేణులతో కలిసి భారీర్యాలీగా సోమప్ప సర్కిల్‌కు చేరుకున్నారు. ర్యాలీలో బీవీకి పట్టణ వాసులనుంచి విశేషస్పందన లభించింది. ప్రజలు ఆయనను పూలమాలతో ముంచెత్తారు. జై బీవీ.. జై టీడీపీ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కుర్ణీ ఆచారం ప్రకారం చేనేతలు ధరించే టోపీని ధరించి ర్యాలీలో పాల్గొన్న బీవీ, ఎంపీ సంజీవకుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే పద్మశ్రీ మాచాని సోమప్ప ముని మనవడు మాచాని సోమనాథ్ సైతం బీవీ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దారిపొడవున పసుపుజెండాలు రెపరెపలాడాయి. టీడీపీ శ్రేణులు మెడలో పసుపుకండువాలు కప్పుకొని పసుపుజెండాలతో రావడంతో ట్యాంక్‌బండ్ రోడ్డు నుంచి సోమప్ప సర్కిల్ వరకు ప్రధాన రహదారి పసుపుమయంగా మారింది.



● బీవీ నామినేషన్ దాఖలు : టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎంపీ సంజీవకుమార్, పద్మశ్రీ మాచాని సోమప్ప ముని మనవడు మాచాని సోమ్‌నాథ్, చేనేత నాయకులతో కలిసి నామినేషన్‌ను దాఖలు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవికి టీడీపీ అభ్యర్థి బీవీ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు.

●బీవీ సతీమణి నిత్యాదేవి నామినేషన్ దాఖలు: టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి సతీమణి బైరెడ్డి నిత్యాదేవి రెండు సెట్ల నామినేషన్‌ను దాఖలు చేశారు. టీడీపీ మహిళా నాయకురాళ్లతో కలిసి ఆమె ఆర్వో చిరంజీవికి రెండు సెంట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు.


నామినేషన్‌కు తరలుతున్న టీడీపీ శ్రేణులు


నామినేషన్ అనంతరం మాట్లాడుతున్న బీవీ

జగన్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది : బీవీ

రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న జగన్ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని మాజీ ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం నామినేషన్ దాఖలు చేసిన ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాణసమానమైన టీడీపీ కార్యకర్తలు, ఎమ్మిగనూరు ప్రజల ఆశీర్వాదంతో నామినేషన్ దాఖలు చేశానని ప్రకటించారు. ఎన్నికల కురుక్షేత్రంలో ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మిగనూరులో తాను, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడులు అఖండ మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మిగనూరులో టీడీపీ గెలిచినప్పుడల్లా ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయడం ఆనవాయితీగా వస్తోందని, ఈ సారి కూడా అదే జరగబోతోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేశాయ్‌మాదవరావ్, గడ్డం నారాయణరెడ్డి, కాశింవలి, కొండయ్య చౌదరి, రాందాసుగౌడు, దసాయాగర్, రామకృష్ణనాయుడు, తురేగల్ నజీర్, రంగస్వామిగౌడు, జయన్న, నజీర్, పార్లపల్లి మల్లికార్జున పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ సంజీవ్‌కుమార్, మాచాని సోమనాథ్, బీవీ

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి



టీడీపీ శ్రేణులతో రాఘవేంద్రరెడ్డి, కౌతాళం మండలంలో ప్రచారం చేస్తున్న టీడీపీ మంత్రాలయం అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 18: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గంలోని కౌతాళం మండలంలోని ఉరుకుంద గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు రాఘవేంద్రరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలంతా ఐక్యంగా అందరినీ కలుపుకొని మంత్రాలయం గడ్డపై టీడీపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలని కోరారు. పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఉనికిని కాపాడడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హుశేనీ, వీరేష్, అల్లయ్య, రాము, వీరేష్, వెంకట్రాముడు, నాగప్ప పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి బాలనాగిరెడ్డి చేసింది శూన్యం

కౌతాళం: మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేసేందేమి లేదని ఎన్డీఏ కూటమి అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిప్పలదొడ్డి, కరణి, మల్లనహట్టి, చూడి, చూడి క్యాంపు గ్రామాలలో గురువారం టీడీపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలనాగిరెడ్డి ప్రజలకు ఏమీ చేయకపోగా ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ తమ అనుచరులతో దర్జాగా కబ్జా చేసుకుని పాగా వేశారని విమర్శించారు. పేదల స్థలాలను కూడా వదలకుండా దౌర్జన్యంగా ఆక్రమించిన ఘటనలు అనేకం ఉన్నాయని గుర్తుచేశారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. సురేష్‌నాయుడు, వీరేష్, మల్లయ్య ఈరన్న, బీజేపీ నాయకుడు ఈరన్న, గోవిందు ఉన్నారు.

వగరూరు, నేలకోసిగి, ఆర్లబండలో విస్తృత ప్రచారం

మంత్రాలయం/కోసిగి: మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామంలో అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సోదరుడు రఘునాథరెడ్డి పవన్‌కుమార్ రెడ్డి, కేశన్న, లింగప్ప ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే కోసిగి మండల పరిధిలోని నేలకోసిగి, ఆర్లబండ గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. బీసీ అభ్యర్థి గెలుపు కోసం అందరం కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. టీడీపీ నాయకులు వీరారెడ్డి, గోపాల్, నరసింహులు, ఉరుకుంద, కర్నూలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక నామినేషన్


నామినేషన్ దాఖలు చేస్తున్న వైసీపీ అభ్యర్థి బుట్టారేణుక

ఎమ్మిగనూరు టౌన్/ రూరల్, ఏప్రిల్18: వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలోని శిల్పా కాలనీలో ఉన్న కార్యాలయం నుంచి ర్యాలీగా కొత్త మున్సిపాలిటీ వరకు చేరుకొని అక్కడి నుంచి సోమప్ప సర్కిల్ నుంచి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, రుద్రగౌడు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, న్యాయవాదితో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో చిరంజీవికి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కేఆర్. రాఘవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, నీలకంఠలు పాల్గొన్నారు.

నామినేషన్‌కు ఎర్రకోట జగన్ డుమ్మా : వైసీపీ అభ్యర్థి బుట్టా నామినేషన్‌కు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తనయుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి డుమ్మా కొట్టారు. జగన్మోహన్ రెడ్డి రాకపోవటం చర్చనీయాంశంగా మారింది. తనకు సీటు ఇవ్వకుండా మొండి చెయ్యి చూపటంతో ముందునుంచి జగన్మోహన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉంటూ వస్తున్న సంగతి తెలిసిందే.

మొదటి రోజు ఐదు నామినేషన్లు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్18: సార్వత్రిక ఎన్నికల నామినేషన్లలో భాగంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మొదటి రోజు గురువారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో చిరంజీవి తెలిపారు. టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, ఆయన సతీమణి నిత్యాదేవి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండ డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో సీఐలు ప్రసాద్, మధుసుదన్‌రావు, మోహన్‌రెడ్డి, మంజునాథ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు షర్మిల ఆలూరుకు రాక

ఆలూరు, ఏప్రిల్ 17: ఏపీపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆలూరుకు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాబురావు తెలిపారు. గురువారం రాత్రి అతిథి హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గురువారం రాత్రి చిప్పగిరిలో షర్మిల బస చేస్తారని, శుక్రవారం ఉదయం బయలుదేరి 10 గంటలకు ఆలూరు అంబేద్కర్ కూడలిలో జరిగే సభలో పాల్గొంటారని తెలపారు. ఆలూరు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఆదోనిలో ఒకే ఒక్క నామినేషన్

● బీఎస్పీ అభ్యర్థి దాఖలు

ఆదోని, ఏప్రిల్ 17: ఆదోని నియోజకవర్గంలో మొట్ట మొదటి నామినేషన్ దాఖలయ్యింది. బీఎస్పీ అభ్యర్థి, బీఎస్పీ పార్టీ తరుపున ఆసియా భాను అమ్లివాలే గురువారం తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మకు అందజేశారు. నామినేషన్‌ల ప్రక్రియ పూర్తిగా రికార్డు చేసేందుకు నామినేషన్‌లు స్వీకరించే గదిలో అభ్యర్థులు ప్రవేశించే ద్వారాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అభ్యర్థులు ఊరేగింపులను, నామినేషన్ దాఖల ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తామని ఎన్నికల అధికారి తెలిపారు.

ఆలూరులో మొదటి రోజు నామినేషన్ నిల్

ఆలూరు : సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల అయింది. మొదటి రోజు నామినేషన్‌ల స్వీకరణ కోసం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే ఎవ్వరూ నామినేషన్ల వేయలేదని ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారం రాము నాయక్ తెలిపారు.

బీసీ బిడ్డను ఆశీర్వదించండి

● మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ఆదోని రూరల్ ఏప్రిల్ 18 : వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ఎన్డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథిని అఖండ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ప్రజలను కోరారు. గురువారం మండల పరిధిలోని పెద్ద పెండేకల్లు, ఆరేకల్లులో కూటమి ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాలతో పార్థసారథికి మంచి సంబంధాలు ఉన్నాయని, ఆయనను గెలిపిస్తే నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తారని మీనాక్షి నాయుడు ప్రజలకు తెలిపారు. డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ మోదీ పంపిన మనిషిని తానేనని, ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి సమస్యలను పరిష్కరిస్తానని కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రజలకు తాగునీరు కూడ అందించలేకపోయారని విమర్శించారు. నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, గుడిసె కృష్ణమ్మ, భాస్కర్‌రెడ్డి, రంగస్వామి, దేవేంద్రప్ప పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మీనాక్షినాయుడు

చంద్రబాబుతోనే అభివృద్ధి

వెల్దుర్తి, ఏప్రిల్, 18 : మ ఒక్క చాన్స్ అంటూ జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, రాష్ట్రం మళ్లీ అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు వల్లే సాధ్యమని టీడీపీ పత్తికొండ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం మండలంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బలరాంగౌడు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా క్రిష్ణాపురం, కలగొట్ల గ్రామాలలో ఉదయం చేపట్టగా, సాయంత్రం పుల్లగుమ్మి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, నాగేశ్వర్ రెడ్డి, సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడు, జయరాముడు, రామకృష్ణ, రామకృష్ణ ఆచారి, సుధాకర్‌గౌడు, హనుమన్న, మద్దిలేటి పాల్గొన్నారు. అనంతరం గుంటుపల్లె గ్రామంలో టీడీపీ నాయకుడు ఈదుల వెంకటరాముడు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ టీడీపీకి మద్దతు తెలిపి ప్రజాపాలనకు శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో రాముడు, శేఖర్, సలేంద్ర, గొల్లరాముడు, గిట్ట వెంకటరాముడులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న కేఈ శ్యాంబాబు

కవీంద్రతీర్థుల ఆరాధన మహోత్సవాలు

మంత్రాలయం, ఏప్రిల్ 18: రాఘవేంద్రస్వామి మఠం పూర్వ పీఠాధిపతి కవీంద్రతీర్థుల ఆరాధన మహోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. కర్ణాటకలోని నవబృందావనంలోని కవీంద్రతీర్థుల బృందావనానికి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేసి మహామంగళహారతులు ఇచ్చారు. భక్తులకు ముద్రధారణ చేశారు.

ఘనంగా రథోత్సవం

కౌతాళం, ఏప్రిల్ 18: బదినేహల్ మల్లికార్జునస్వామి, సుళేకేరి గ్రామ పొలిమేరలోని బుడుములదొడ్డి ఆంజనేయస్వామి రథోత్సవం గురువారం అశేష జనవాహిని మధ్య కన్నులపండువగా సాగాయి. బదినేహల్‌లో మల్లికార్జున స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామ పెద్దల ఇంటి నుంచి మేటి కుంభం దేవాలయానికి చేరి ప్రత్యేక పూజల అనంతరం భక్తుల మధ్య రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. బుడుములదొడ్డిలో సీతారాముల విగ్రహాలను రథోత్సవంపై ఉంచి సాయంత్రం పూజల అనంతరం భక్తుల సమక్షంలో రథాన్ని లాగారు.

చింతలముని ఆలయ అభివృద్ధికి టీడీపీ విరాళం

గోనెగండ్ల, ఏప్రిల్ 18: స్థానిక కురువ వీధిలో ఉన్న చింతలాముని నల్లారెడ్డి స్వామి దేవాలయ అభివృద్ధికి గాను టీడీపీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు గురువారం ఆలయ పూజార్లకు రూ. 10వేల విరాళం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం ప్రధానకార్యదర్శి కౌలుట్లయ్యనాయుడు, నాయకులు దరగలమాబు, టీఎన్‌టీయూసీ నాయకులు చెన్నల రాయుడు, మాజీవైస్ ఎంపీపీ బుడ్డప్ప పాల్గొన్నారు.

22 నుంచి ఫక్కీరప్ప స్వామి జాతర

మద్దికెర, ఏప్రిల్ 18: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామ శివారులోని అవధూత ఫక్కీరప్పస్వామి జాతర మహోత్సవాలు ఈ నెల 22న ప్రారంభమై 24న ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ మూడు రోజులపాటు భక్తిశ్రద్ధలతో వివిధ పూజాకార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. 24న స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు కనుమ పండుగను నిర్వహిస్తారని, సాయంత్రం పలు సాంస్కృతిక పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

బండలాగుడు పోటీలు: ఈ ఉత్సవాల సందర్భంగా 24న రాష్ట్రస్థాయి ఖిలారీ దేశ్‌మిద్రా రాతిదూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు సర్పంచ్ బురుజుల విజయుడు, గంపల ప్రసాద్, మొలగవెల్లి గోపాల్, ప్రసాద్, యుగంధర్ తెలిపారు. ఆసక్తిగల వారు 24వ తేదీ ఉదయంలోపు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మాదిగలను దగా చేసిన జగన్

● వీరభద్ర గౌడ్‌కు ఎమ్మార్పీఎస్ మద్దతు

ఆలూరు, ఏప్రిల్ 17: మాదిగలను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దగా చేశారని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ముత్యాల గాదిలింగ అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ముఖ్యంగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించి ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఆయన వెంట హాలహర్వి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు ఉచ్చిరంగ, గంగాధర్, హోలగుంద పకీరప్ప, శేషగిరి, చిప్పగిరి శివరాజ్ కుమార్, శివ, రామాంజనేయులు, పెద్ద సంజప్ప, బాలరాజు, మల్లి, బిలేహాళ్ మల్లయ్య పాల్గొన్నారు.


వీరభద్రగౌడ్‌కు మద్దతు తెలుపుతున్న నాయకులు

నిరుద్యోగులను వంచించిన జగన్

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

ఆలూరు, ఏప్రిల్ 17: ప్రతి ఏడు జాబ్‌క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను సీఎం జగన్ వంచించారని, ఓటుతోనే బుద్ధిచెప్పాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. గురువారం టీడీపీ ఆలూరు అభ్యర్థి వీరభద్ర గౌడ్, కర్నూలు పార్లమెంటు అభ్యర్థి పంచిలింగాల నాగరాజుతోకలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవినీతి రాజ్యమేలిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వేదవతి ప్రాజెక్టుకు నిధులు మంజూరైతే జగన్ వాటిని ఇవ్వకుండా చేశారని, దీంతో ప్రజలకు సాగు, తాగనీరు కష్టాలు తప్పలేదని పేర్కొన్నారు. ఆలూరు ప్రాంతంలో రైతుల సంక్షేమం కోసం గోదాములను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కురువ జయరాం, వైస్ చైర్మన్ సాలిసాహెబ్, మాజీ జడ్పీటీసీ రాంభీం నాయుడు, తాలూకా నాయకులు ఎల్లార్తి మల్లికార్జున, మండల కన్వీనర్ అశోక్, రైతు సంఘం తాలూకా నాయులు దేవేంద్ర, తెలుగు యువత నాయకులు నెమేకల్ రవి, రాముడు, రాజు, నాగరాజు, కొమ్ము రామంజి, నరసప్ప పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిక్కారెడ్డి